క్లుప్తంగా

రాయితీపై టమాటా



రైతు బజారులో టమాటా విక్రయాలు

రాజాం: పట్టణంలో రైతు బజార్‌లో రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా బుధవారం 300 కిలోల టమాటాలు రాయితీపై విక్రయించారు. టమాటా ధర కిలో రూ.100లకు చేరడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజారుల్లో రాయితీపై కిలో రూ.50లకే విక్రయిస్తున్నట్లు రాజాం వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జ్ రెడ్డి చిన్నంనాయుడు తెలిపారు. టమాటా ధర తగ్గే వరకు ప్రతీరోజు ఉదయం 8 గంటలకు విక్రయాలు ప్రారంభించి పరిమితి స్థాయిలో ఈ విక్రయాలు చేపడతామని పేర్కొన్నారు.

పరామర్శ



హరినాథరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలో మిర్తివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రాజాపు రమణను శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు పరామర్శించారు. రెండురోజుల క్రితం ఆయన పెద్ద సోదరుడు హరినాథరావు మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ బుధవారం గ్రామానికి చేరుకుని హరనాథరావు కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట సర్పంచ్‌లు దాసరి దాలినాయుడు, గంటా షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ ఎన్ని శ్రీనివాసరావ, తదితరులు ఉన్నారు.

310 మందికి వైద్య సేవలు



రోగులకు వైద్యతనిఖీలు చేస్తున్న వైద్యుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో డోలపేట కనకదుర్గా ఆలయం వద్ద రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుమారు 310 మంది రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. వైద్య సేవల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఆయుర్వేద వైద్యం శిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద వైద్యుడు సునీల్‌కుమార్ మందులు అందజేశారు. ఆయుర్వేద మందులతో మంచి ఫలితాలు ఉంటాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని అన్నారు.

రేపటి వరకు గడువు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11 వరకు పెంచిందని ఎక్సైజ్ శాఖ బొబ్బిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో బుధవారం నోటీసు అంటించారు. మద్యం షాపుల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బాడంగి: చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ఫిర్యాదు నమోదు చేసిన తరువాత ఫిర్యాదుదారునికి రశీదు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. గంజాయి రవాణాపై నిఘా పెంచాలని, వాహనాల తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. పాతబొబ్బిలి, కొట్టక్కి, పిట్టాడలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పండగల నేపథ్యంలో గ్రామాల్లో పేకాట, కోళ్లపందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం, గంజాయి, ఇసుక అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 'సంకల్పం' పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నవరాత్రి వేడుకల్లో అశ్లీల నృత్యాల ప్రదర్శన, బాణసంచా వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆయన వెంట సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు ఉన్నారు.

కలగా మిగిలిన కాజ్‌వే..

- దశాబ్దాలుగా ఎదురుచూపు
- వర్షాకాలంలో జలదిగ్బంధంలో కొత్తరేగ–పాతరేగ గ్రామాలు
- విద్య, వైద్య సదుపాయాలకు దూరమవుతున్న గ్రామస్తులు



పాతరేగ, కొత్తరేగల మధ్య ఉన్న ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే లేకపోవడంతో విద్యార్థులు గెడ్డలో నుంచి పాఠశాలకు వెళ్తున్న దృశ్యం

రామభద్రపురం: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. దీర్ఘకాలంగా ఉన్న ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల మధ్య ఉన్న గెడ్డలు, వాగులపై కాజ్‌వేలు లేకపోవడంతో వరదల సమయంలో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజ్‌వేలు నిర్మించాలని అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు కోరినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. కాజ్‌వేల నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. రామభద్రపురం మండలంలోని కొత్తరేగ–పాతరేగ గ్రామాల మధ్య చిన్న గెడ్డలు ఉన్నాయి. స్వాతంత్య్రం రాకముందు నుంచి వీటిపై కాజ్‌వే నిర్మాణాలు చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినా, వరద వచ్చినా మండల కేంద్రంతో ఆ గ్రామాలకు సంబంధాలు తెగిపోతాయి. ఆ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు కూడా అధ్వానంగా ఉండడంతో అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించే 108, 104 వంటి వాహనాలు కూడా రాలేని పరిస్థితి. వర్షం వస్తే చాలు గెడ్డలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాంటి సమయాల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. గర్భిణులు, అనారోగ్యంతో బాధపడే వారిని ఆస్పత్రికి తరలించడం కూడా కష్టంగా మారుతోంది. ఇతర గ్రామాలతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. దశాబ్దాలుగా ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు..



వర్షాకాలం వచ్చిందంటే మా రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో మండల కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు పడుతున్న యాతన అంతా ఇంత కాదు. ప్రజల పడుతున్న అవస్థలను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి కాజ్‌వే నిర్మాణ చేపడితే మా రెండు గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది.

– పెద్దింటి కృష్ణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ, రేగ

పాఠశాలను మానేయాల్సిందే..



వర్షం కురిస్తే చాలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. ఆ రోజు సెలవు పెట్టేయాల్సి వస్తోంది. గెడ్డలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాన్ని దాటి పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పాతరేగ, కొత్తరేగ మధ్య ఉన్న ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– గొర్లి శ్రీనివాసరావు, పాతరేగ

పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



రామభద్రపురం: మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వెంకటరమణ



బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్



బాడంగి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

రామభద్రపురం: పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈవోపీఆర్డీ వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ మహాత్మ గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషిచేయాలన్నారు. ప్రతీ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు గుర్తించాలని, వాటి ఆమోదానికి తీర్మానాలు చేయాలని సూచించారు.

- బొబ్బిలి రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. వార్డ సభ్యుల విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, తదితరులు ఉన్నారు.
- బాడంగి: పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి పాడుపడాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లకు ఎంపీపీ భోగిగౌరి అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, టీడీటీ విశాలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎస్.భాస్కరరావు, తెంటు మధు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదు



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ అధికారులు

రాజాం: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని ఎస్ఎన్‌పీ, సీఎస్‌సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అధికారులు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచనల మేరకు మండలంలోని బొద్దాం పీహెచ్‌సీ వద్ద బుధవారం ఎస్ఎన్‌పీ, సీఎస్‌సీ ప్రాజెక్టులు సంయుక్తగా హెచ్ఐవీ నియంత్రణపై వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని, వారితో స్నేహపూర్వకంగా మెలిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సమన్వయకర్త రాంప్రసాద్, డాక్టర్ సిద్ధేశ్వరి, ప్రాజెక్ట్ సిబ్బంది బి.అనురాధ, పీహెచ్ఎన్ ఎన్.సరోజిని, సూపర్‌వైజర్లు ఎస్.శశికిరణ్, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



సారథి రోడ్డులో రియల్ ఎస్టేట్ భూమిని పరిశీలిస్తున్న డీటీ రాజశేఖర్, తదితరులు

రాజాం: పట్టణ పరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈనెల 7న సాక్షిలో 'రాజాంలో రియల్ దందా' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజశేఖర్, ఆర్ఐ విద్యాసాగర్, వీఆర్‌ఓ హేమంత్ తదితరులు లేఅవుట్లను పరిశీలించి, సంబంధిత యజమానుల వద్ద వివరాలు సేకరించారు. సారధి, అంతకాపల్లి, బుచ్చింపేట, కంచరాం తదితర ప్రాంతాల్లో వీఆర్‌ఓలు ద్వారా వివరాలు రాబెట్టారు. నివేదికలు తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు.

● సరస్వతీ నమోస్తుతే..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమాత సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు బారులుతీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. వాగ్దేవి కరుణాకటాక్షాలు తమ పిల్లలపై ప్రసరించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు.

– బొబ్బిలి/రాజాం



బాడంగి: ఉమా సోమేశ్వరాలయంలో శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



రామభద్రపురం: స్థానిక కూరాకుల వీధిలో పూజలందుకుంటున్న దుర్గామాత



బొబ్బిలి రూరల్: సరస్వతీదేవి ఆలయంలో అక్షరాభ్యాసం కోసం బారులుతీరిన చిన్నారులు



బొబ్బిలి రూరల్: పక్కి గ్రామంలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రాజాం: గాంధీనగర్‌లో సరస్వతీదేవి పూజలో పాల్గొన్న చిన్నారులు



రాజాం సిటీ: బస్టాండ్ సమీపంలోని నవదుర్గ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



బొబ్బిలి: పాత బొబ్బిలిలో అక్షరాభ్యాసం చేసిన చిన్నారులతో తల్లిదండ్రులు



వంగర: రుషింగిలో సరస్వతీపూజల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి



బొబ్బిలి రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్యామ్‌సుందర్



రేగిడి: ఉంగరాడలో కషాయాలు తయారీని వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది



వంగర: మగ్గూరులో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ఆవశ్యకత, రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, పంట తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

రేగిడి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. ఉంగరాడ, అంబఖండి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు, అధిక లాభాలు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో మేలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందరావు, భుజంగరావు, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు, ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు పాల్గొన్నారు.

మగ్గూరులో..

వంగర: మండలంలో మగ్గూరు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కన్నబాబు వరి పంటలో సాగు పద్ధతులు, పంటను కోత విధానం, రబీలో పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.

సంక్షిప్తంగా..

ప్రతిభకు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న జీఆర్‌కే ఫౌండేషన్ ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. గ్రామానికి చెందిన చుక్క రాకేష్, కాట్నాన వాహిని, చుక్క నీలిమ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. వారిని ప్రోత్సహిస్తూ జీఆర్‌కే ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక సరస్వతీదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు, పెన్నుల వితరణ



చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న దాతలు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీ రాచ్చేరువలస గిరిజన గ్రామంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్నులను వితరణ చేశారు. గ్రామానికి చెందిన దూపం వాసు, కృష్ణదాసు, పుల్లెల శ్రీనివాసు, తదితరులు గ్రామంలోని సరస్వతీ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేసి, అనంతరం చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

రాజాం: స్థానిక బస్టాండ్ ఆవరణలో అన్నా క్యాంటీన్‌ను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. రాజాం వచ్చిన పేదలకు సకాలంలో కడుపునింపేలా అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. అన్నా క్యాంటీన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు నారాయణ సేవ



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: స్థానిక పీహెచ్‌సీకి బుధవారం వైద్యతనిఖీల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి భక్తులు నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించారు. వందమంది గర్భిణులకు పోషకాహారం అందజేశారు. సత్యసాయి భజనమండలి సభ్యుల సేవలను పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అభినందించారు. కార్యక్రమంలో లావేటి విష్ణుమూర్తి, భూదేవి, మామిడి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: మండలంలో అన్ని గ్రామాల్లో రైతులకు పండ్లతోటల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయం వద్ద మండలంలో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాయితీపై ఇస్తున్న జీడి, మామిడి, సపోట, కొబ్బరి తదితర ఉద్యానవన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఎం.రామినాయుడు, టీఏలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు, తదితరులు

రేగిడి: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు. మండలంలో రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో బుధవారం డయేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ చేపట్టారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ కేవీ అప్పారావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, ఎల్‌టీ రమణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం



శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న ఆర్‌వీజే నాయుడు, తదితరులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట గ్రామ శ్మశానవాటికలో రాజాం గ్రీన్ బెల్ట్ కోఆర్డినేటర్ ఆర్‌వీజే నాయుడు బుధవారం మొక్కలు నాటారు. తన తల్లి నారాయణమ్మ జ్ఞాపకార్థం దశదిన కర్మ సందర్భంగా 20 మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, పాలవలస గోపి, శాసపు వేణుగోపాలనాయుడు, కడగల నాగరాజు, గ్రీన్ బెల్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణ



పాత బొబ్బిలి వీధుల్లో దసరా విచిత్ర వేషధారణ ప్రదర్శన

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలిలో మింది విజయమోహన మాస్టారు ఆధ్వర్యంలో చిన్నారులు విచిత్ర వేషధారణలను ప్రదర్శించారు. విద్యార్థులు, యువతకు ముఖాలకు వివిధ జంతువులు, పక్షుల మాస్కులు ధరించి దసరా పాటలు పాడుతూ వీధుల్లో ప్రదర్శనలు చేశారు. సంప్రదాయంగా పాడుకునే 'ఏదయా మీదయా..' అనే పాటకు కొత్తదనాన్ని జోడించి చేసిన ప్రదర్శనలు పలువుర్ని ఆకట్టుకున్నాయి.